కథ

# సమిధ

## ఇంజరపు శ్రీనివాసరావు



'తలుపు తెరిచి నావంక చూసిన అమ్మ, మొహం చిట్లించి కంగారుగా చుట్టుపక్కలకు చూసింది.

"ఎందుకు వచ్చావు?! వెళ్లు!" కఠినంగా అంది.

ఆ మాటల్లోని కాఠిన్యానికి ఆమె తన కన్నతల్లేనా అని సందేహం కలిగింది. నాలో కోపం బుస్సున తన్నుకు వచ్చి ఆమెవైపు తీక్షణంగా చూస్తూ...

'నాయీ స్థితికి నీవు కారణం కాదా?!' అని అరిచానని అనుకున్నాను. గొంతులోంచి మాటలు బయటికి రాలేదు. ఎన్నోరోజుల నుంచి తిండిలేక కృషించిన దేహం అందుకు సహకరించలేదు.

"వెళ్లు. వెళ్లు. ఎవరైనా చూస్తే మా పరువు పోతుంది!" నా చూపుల్లోని తీక్షణతకు అమ్మ ఇబ్బందిగా కదులుతుంది. మళ్లీ గొంతు పెగిల్చే ప్రయత్నం చేశాను. నాగొంతు నాకే నూతిలోంచి వినపడినట్లు అనిపించింది. అతిప్రయత్నం మీద చూపుడివేలుని చూపిస్తూ గట్టిగా అరిచాను. నా తల్లిపట్ల మనసులో గూడుకట్టుకున్న ఏహ్యం, ద్వేషం, కసి మొహంలో ప్రతిఫలించాయి. నా అరుపు మూలుగులా బయటకు వచ్చింది. మా అమ్మ ఆ చూపుల్ని భరించలేనట్టు తలుపు తటాలున వేసుకుంది. నాచేయి నిస్సత్తువగా గాలిలోంచి జారిపోయింది.

'మూసిన తలుపు వెనుక నా తల్లి నాకోసం ఒక్క కన్నీటి బొట్టయినా రాల్చక

పోతుందా?! పేగు తెంచుకుపుట్టిన బంధం ఆపాటి విలువైనా నోచుకోదా' . 'అంతా నా భ్రమేమో' నిట్టూర్చాను. అక్కన్నించి వెనుదిరిగాను.

కడుపులో ఆకలిమంటకు తోడు, నెత్తిన ఎండ కాల్చేస్తుంది. వంటిమీద గుడ్డలు మకిలి కంపుకొడుతూ వాంతులు తెప్పించేలా ఉన్నాయి. నిస్సత్తువుతో కళ్లు మూసుకుపోతున్నాయి.

కాలిమీద ఏదో పాకినట్టు అనిపించి కిందికి చూశాను. అది మా ఇంటి పెంపుడు కుక్క. నేను దాన్ని భుజాలమీదకు ఎక్కించుకుని ఆడుకునేదాన్ని, అదీ దాని విశ్వాసం.

చిట్లించిన తల్లి మొహం గుర్తుకు వచ్చింది. "తల్లిదండ్రులు రక్తమాంసాలు కరిగించి పిల్లల్ని పెంచాలి. కాని తనే ఆ పని చేసి పెంచింది. కాని.... తనకు లభించింది... తిరస్కారం, ఈసడింపు" మృగాలే నయమన్నమాట.

ఆలోచనల్లో కాలు తూలి ముందుకు పడబోయాను. సంభాలించుకుని అడుగు ముందుకు వేశాను. అలా పోయి, పోయి బ్రిడ్జి దగ్గర ఆగాను.

కడుపులో ఆకలిమంట, వంట్లో నీర్సం, పైన ఎండ ఇవన్నీ కలగలపి కళ్లు కూరుకుపోయి నిద్రలోకి నన్ను నెట్టివేయసాగాయి.

'నీడకోసం వెదికాను. బ్రిడ్జి కింద నీడ కనిపించింది. బ్రిడ్జి కిందకు చేరుకోబోయే ప్రయత్నంలో కాలు జారింది. అంతే గోడవడ్డుకు ఇసుక మూటలా దొర్లుకుపోయాను. పడినచోట మెత్తగా అనిపించింది. గీరుకున్నచోట మంట తెలుస్తోంది. కాని కళ్లు నిద్రలో మూసుకుపోతున్నాయి. అలాగే నిద్రలోకి వెళ్లిపోయాను. ఎన్నిగంటలయిందో తెలియలేదు.

ఏవో అరుపులు చెవులకు లీలగా వినిపిస్తున్నాయి. కళ్లు తెరుద్దామని బలవంతంగా ప్రయత్నం చేస్తున్నాను. ఒకటి, రెండు నిమిషాలకు గాని అది సాధ్యపడలేదు.

నేను కళ్లు తెరిచేసరికి అతని మొహం నాకు చాలా దగ్గరగా కనిపిస్తుంది. 'కరకుగడ్డం, పిచ్చివాటం, మొరటయిన శరీరం, నల్లగా మసిబారి చిరిగిన వస్త్రాలు.'

నా శరీరంమీద అతని శరీరం ఆయాసంతో రొప్పుతూ, ఊగుతూ ఉంది. కొంతసేపటికి వగురుస్తూ పక్కకు జారిపోయాడు.

నేను పూర్తిగా స్పృహలోకి వచ్చేసరికి అతను చిరిగిన నిక్కరును పైకి లాక్కుంటున్నాడు.

తిడుతూ కర్రతో ఎదురొచ్చిన ముసలాన్ని ఒక నెట్టు నెట్టి వెళ్లిపోయాడు. నేను ముసలాడికేసి నిస్సహాయంగా చూస్తూ దాహంకోసం చేయి చాపాను. చేయిని ఎక్కువసేపు నిలబెట్టలేక జార్చేశాను.

ముసలాడు దగ్గరికి వచ్చి గొంతులో నీళ్లు పోశాడు. వంటిమీద చెదిరిన బట్టల్ని సరిచేశాడు. తన బొచ్చెలోని రొట్టెను నా చేతిలో పెట్టాడు. అది ఎండిపోయి వుంది. మళ్లీ ఏమనుకున్నాడో దాన్ని నీళ్లలో నానవేసి నోట్లో వుంచాడు. దాన్ని నమలకుండానే మింగేశాను. ముక్కలు పెడుతున్నాడు. నేను తింటున్నాను. కడుపులో మంటయితే చల్లారింది. వంట్లో సత్తువ కూడుకోలేదు. కళ్లు నిద్రతో కూరుకుపోతున్నాయి. మగత నిద్ర అది. ఆ ముసలాడు నా పక్కనే కూర్చున్నాడు. ఆ కలత నిద్రలో వేయి ఆలోచనలు.

'నాకు ఎయిడ్స్ వంటి భయంకర వ్యాధి వుందని తెలిస్తే ఈ బొమికలు దేరిన మాంసపు గూడు కోసం అలా తెగపడేవాడా?!' 'ఈ ముసలాడు నా దగ్గరికి చేరి సేవలు చేసేవాడా?'


తాత నీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. వచ్చేజన్మలో నీ కూతురుగా పుట్టి నీ రుణం తీర్చుకుంటాను. 'అమ్మో! వద్దు! వద్దు! ఆడదానిగా పుట్టను. అతను కూడా ఈ జన్మలోని తండ్రిలా నన్ను తెగనమ్మడని గ్యారంటీ ఏమిటి?'

'నిద్ర! నిద్ర! కలత నిద్ర!' నిద్రలోనే పీడకలలు, అరుపులు' ఆమె స్థితి తెలియని ముసలాడు నిర్వేదంగా పక్కన కూర్చున్నాడు. గత జ్ఞాపకాలు రంగులు తిరుగుతున్నాయి.

000

"అమ్మా! తల్లీ! ఆగదిలోకి వెళ్లవే" మామయ్యకు ఈ పాలు ఇయ్యి! నీకు ఏది కావాలంటే, అది అడుగు కొనియిస్తాడు. ఒట్టు!... నిజం... నాతోడు. కావాలంటే మీ నాన్ననడుగు! నిజం అంకుల్ చాలా మంచివాడు."

ఎందుకో నన్ను గంగిరెద్దులా అలంకరించారు. చీర కట్టారు. జాకెట్టు వేశారు. పూలు అలంకరించారు. సెంటు పులిమింది. కాటుక పెట్టి వాసన పౌడర్లు రాసింది. అవన్నీ నాకు ఇష్టంగానే అనిపించాయి. గదిలోకి వెళ్లమంటే నాకు తిక్కరేగి



## మెత్తని చెప్పులే మేలు

**చా**లామందికి పాదాల్లో ఆనెలుంటాయి. ఆనెలున్న చోట చర్మం గట్టిగా, మృతకణాలతో కూడి వుండి, తాకినా స్పర్శ తెలియకుండా వుంటుంది. ఇది క్రమంగా పెరగటం వల్ల నొప్పి కలుగుతుంది. చాలా వేగంగా పాదమంతా వ్యాపించొచ్చు కూడా. అంత వరకూ బాగా సాగిన నడక వేగం, ఆనెలు రావటంతో తగ్గవచ్చు. పాదాలు నొప్పిగా అనిపించొచ్చు. పాదాల్లో పొడుగ్గా వుండే ఎముకలు శరీరభారాన్ని మోయలేకపోవచ్చు. కాస్త బరువు ఎక్కువైతే పాదాల కింది చర్మం మందంగా అయి కఠినంగా మారుతుంది. దానితో పాటు నొప్పీ పెరుగుతుంది. షూ ఇన్సర్టులు వాడటం వల్ల నొప్పి తగ్గుతుంది. నడకను గమనించి వంకరగా కాక మామూలుగా నడవటం అభ్యాసం చేయటం వల్ల నొప్పి తగ్గుతుంది. తక్కువ హీల్ వున్న చెప్పులు, షూజ్ వాడటం మేలు. బెడ్ రూమ్ స్లిప్పర్లను కూడా కాస్త మందంగా తయారు చేయించుకుని వేసుకోవచ్చు. ఇంట్లో కూడా కాళ్లకు ఏమీ లేకుండా నడవకూడదు. నొప్పి కలిగించే ఆనెలను, బ్లేడుతో కోయటం, కత్తెరతో కత్తిరించటం వల్ల సమస్య పెరుగుతుంది కనుక, వాటిని ప్యూమిస్ స్టోన్‌తో మెల్లగా రుద్దేసి తీసేయవచ్చు. మధుమేహరోగులు, రక్తప్రసరణ క్రమంలో లేనివారు జాగ్రత్తలు ఎక్కువ తీసుకోవాలి.

ఎస్.

జడలో పూలు తీసి విసిరికొట్టాను. ఆ ఇంటిగలావిడ గుడ్లు పెద్దవిచేసి ఉరిమి చూసింది. భయంతో గదిలోకి వెళ్లాను. సరిగ్గా గంటతర్వాత కేకలేస్తూ నేను బయటకు వచ్చాను. నాన్న కనబడలేదు. భయంతో ఏడుస్తూ బాత్‌రూమ్‌లోకి దూరి నీళ్లతో కడుక్కున్నాను. ఎంత కడిగినా రక్తం వస్తూనే ఉంది.

మర్నాడు ఉదయం ఇంటికి తీసుకుపోయారు. ఇంటిలో కొత్త కలరు టి.వి. అక్క మెళ్లో బంగారు గొలుసు కనిపించాయి.

ఇంట్లో ఇంతకు ముందులా నాతో మాట్లాడటానికి ప్రయత్నం చేస్తే వాళ్లకి దూరంగా జరిగాను.

మా అమ్మకు అంతా చెప్పాలని గది దగ్గరకు వెళ్లాను. నాన్న అమ్మతో మాట్లాడుతున్నాడు. వాళ్ల సంభాషణలు బట్టి అమ్మ నా తరుఫున వాదిస్తోంది. కాని ఆమె గొంతు బలహీనంగా అయిపోయింది తండ్రి నిర్దయ మూలంగా. ఉన్న ఆ చిన్న గొంతుని నాన్న నోట్ల కట్టలతో మూయించేశాడు. అమ్మ కళ్లు ఆశతో విప్పారడం చూశాను. నేను నిరాశగా వెనుతిరిగాను.

మళ్లీ మరోరోజు కారు వచ్చి ఆగింది. నాన్న, నన్ను కారులో ఎక్కించుకుని బయలు దేరాడు. నాన్న చేతిలో డ్రైవరు నోట్లకట్ట పెట్టడం దూరంగా కారులో ఉన్న నాకు కనిపించింది. మర్నాడు ఉదయం ఇంటికి వచ్చాను. రెండు రోజుల్లో ఇంటి వాతావరణం మారిపోయి, పెళ్లి కళ వచ్చేసింది. అక్క పెళ్లి కుదిరింది. పెళ్లికి డబ్బు సర్దుబాటు కావటం పెళ్లి జరిగిపోవటం అన్ని నా కళ్లముందే జరిగాయి.

మా ఫ్యామిలీ స్టేటస్ పెరిగింది. మా కష్టాలు ఈడేరాయి. నా చెల్లెలు పెళ్లి కూడా కుదిరింది. నా తమ్ముడు మంచి స్కూల్లో చదువుతున్నాడట. ఇదంతా మూడు సంవత్సరాల్లో సాధ్యమయింది. మా నాన్నకు ఇరవై సంవత్సరాల్లో సాధ్యం కాని పని అది.

ఎవరో విటుడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. 'ఒకటి కావాలంటే మరొకటి వదులుకోవాలి' కాని 'నేను ఏదీ కావాలని కోరుకోకపోయినా, నా సర్వస్వం కోల్పోయాను'

రింగులు తిరుగుతున్న ఆలోచనల తాకిడికి కళ్లలోంచి నీరు బుగ్గల మీదికి జాలి చారికలు కడుతుంది. ముసలాడు బుగ్గలు తుడిచాడు. ఆ ఆప్యాయతకు మరింత కన్నీళ్లు పొంగాయి.

కడుపులో సన్నటి నొప్పి ప్రారంభమయి మొత్తం అవయవాలకు పాకి నన్ను కుదిపేయసాగింది. కళ్లు తేలిపోతున్నాయి. వళ్ల బిగువున నొప్పిని తట్టుకుంటున్నాను. ఇక నాకు సాధ్యం కాక గట్టిగా మూలిగి వాంతి చేసుకున్నాను. ముసలాడు కంగారుగా నా వెన్ను నిమిరసాగాడు. నొప్పితో పేగులు లుంగచుట్టుకుపోతున్నాయి. ఊపిరి తీసుకోవడం దుర్లభమనిపించింది. కనుగుడ్లు వెనక్కి తిరిగడం తెలుస్తోంది. అతని చేతుల్లో నెమ్మదిగా అచేతను రాలయ్యాను.

**000**

నాలోంచి నేను వేరయినట్టు, అగాథంలోంచి వెలువడ్డట్టు, ఒక్కసారే బంధనాలన్నీ విడదీసుకుని బయటపడ్డట్టు అనిపించింది. ముసలాడు నన్ను మోసుకెళ్లి బ్రిడ్జిమీద పడుకోబెట్టడం తెలుస్తుంది. పక్కన గుడ్డ పరిచాడు. అతని మొహంలో విషాదఛాయలు లీలగా కనిపిస్తున్నాయి. నన్ను నేను తేరిపారా చూసుకోగలుగుతున్నాను. కాని నేనేంటి అచేతనంగా, కదలకుండా ఉన్నాను. నాకు అన్నీ తెలుస్తు న్నాయి. కాని నా అస్తిత్వం నాకు తెలియని వింతస్థితి. అంతా కొత్తగా, గందరగోళంగా అనిపిస్తుంది.

ఈ స్థితిలో ఉన్న నాకు దూరం నుంచి మానాన్న స్కూటరుమీద రావటం తెలిసింది. అంతే నేను మానాన్న పక్కన ఉన్నాను. నాన్న స్కూటరుమీద వేగంగా వస్తున్నాడు. ఆశ్చర్యం! అంతే వేగంగా నాన్నను నేను వెంబడిస్తున్నాను. ఇదెలా సాధ్యం?! అప్పుడు అర్థమయింది నేను చనిపోయానని.

బ్రిడ్జి మీదకు వచ్చేసరికి నాన్న నన్ను చూశాడు. స్కూటరుకు బ్రేకువేసి పక్కన ఆపాడు.

ముసలాడు 'అనాథ శవం బాబు ధర్మం సేయండి' చేతులు చాపి అర్థిస్తున్నాడు.

'లేదు! లేదు! నేను అనాథను కాను నాన్న నన్ను తీసుకువెళతాడు' ఆశతో నాన్న ఎదురుగా వచ్చి మొహంలో మొహం పెట్టి చూస్తున్నాను. నాన్న మొహంలో ఏ భావం లేదు. కాదు బయట పడకుండా జాగ్రత్తపడుతున్నాడేమో ననిపించింది.

పర్సులోంచి వందరూపాయలు తీసి ముసలాడి చేతిలో వేసి స్కూటరు గేరు మార్చి వెళ్లిపోతున్నాడు. నేను నాన్న వెనుకబడ్డాను. వద్దు, వద్దూ అంటూ.

ముసలాడు 'ధర్మప్రభువులు ఎంత జాలి గుండె. ఈ డబ్బుల్తో మట్టిలో పూడ్చేయొచ్చు" అన్న మాటలు వినపడ్డాయి. నాన్న నాకు అందనంత దూరం వెళ్లిపోయాడు. నాకు వెళ్లాలనిపించలేదు. ఆశ్చర్యం నేను ముసలాడి దగ్గరే ఉన్నాను. మళ్లీ 'ధర్మప్రభువులు' అని అంటున్నాడు. కాదు! కాదు! అని ముసలాన్ని ఒప్పించాలని ప్రయత్నం చేసి అలిసిపోయాను. నా ఏ ప్రయత్నం కూడా ముసలాడికి తెలియటంలేదు. చివరి ఆశ కూడా అడిఆశ అవటంతో ముసలాడి పక్కన కూర్చుని రోదిస్తున్నాను. అది ఏడుపా?! కాదు! ఆత్మఘోష.

ఇవేమి పట్టని ముసలాడు తన వెనకాల తిరిగే కుర్రాడికి రెండు ఎదురు కర్రలు, కుండ, తుంగచాప, పురుకోస, పూలు, చేట తెమ్మని పురమాయించాడు. ■

## రక్తపుపోటును తగ్గించే సోయాబీన్స్

వేయించిన సోయాబీన్స్ గింజలు తినటం వల్ల, మెనోపాజ్ దశలో వున్న మహిళలకు మేలు జరుగుతుందట. మెనోపాజ్ దశలో వున్నవారు సాధారణంగా హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ చేయించుకుంటుంటారు. దాని వల్ల అప్పటికి ప్రశాంతత కలిగినా, హృదయవ్యాధులు, వక్షోజాల కాన్సరు వచ్చే అవకాశాలున్నాయట. జపానులో సోయాబీన్స్ వాడకం విరివిగా వుంటుంది. కనుక అక్కడి అతివల్లో హృదయవ్యాధులు, బ్రెస్ట్ కాన్సర్ తక్కువగా వస్తున్నాయని పరిశీలకులంటున్నారు. సోయాబీన్స్ తీసుకున్న కారణంగా రక్తపుపోటు తగ్గటం వల్ల, కార్డియోవాస్క్యులర్ వ్యాధులు వచ్చే అవకాశాలు కూడా చాలా వరకు తగ్గిపోతాయట. డాక్టర్లిచ్చే మందుల వల్ల కలిగే ఫలితాలే సోయాబీన్స్ తీసుకోవటంతోనూ కలుగుతాయి కనుక సోయాబీన్స్ తీసుకోవటమే మేలంటున్నారు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వారు.

ఎస్.